క్లుప్తంగా

కల్యాణ వైభోగమే..



గౌరీపరమేశ్వరుల కల్యాణం నిర్వహిస్తున్న రుత్వికులు

కొత్తవలస: గౌరీపౌర్ణమి ఉత్సవాల్లో భాగంగా మంగళపాలెంలో ఏర్పాటు చేసి మండపంలో గురువారం రాత్రి గౌరీపరమేశ్వరుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి గౌరీపార్వతులను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండపం వద్ద భక్తులకు భారీ ఎత్తున అన్నసమారాధన చేశారు.

వీరబ్రహ్మేంద్ర స్వామి జయంతి



స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న అర్చకులు

గజపతినగరం: జగద్గురు శ్రీమద్విరాజ్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 415వ జయంతి వేడుకలను విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పురిటిపెంట సంతతోటలో వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు మణికంఠ నేతృత్వంలో భక్తులు స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. కార్తీకశుద్ధ ద్వాదశి రోజున స్వామివారి జయంతి వేడుకలు జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని సంఘ సభ్యులు, భక్తులు తెలిపారు.

సంతోషిమాతకు కుంభాభిషేకం



సంతోషిమాతకు కుంభాభిషేకం చేస్తున్న భక్తులు

కొత్తవలస: మండలంలోని తుమ్మికాల్లి గేటు సమీపంలో ఉన్న సంతోషిమాత ఆలయంలో శుక్రవారం క్షీరాబ్ది ద్వాదశిని పురస్కరించుకుని అమ్మవారికి కుంభాభిషేకాలు నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి వందలాది మంది మహిళలు బిందెలతో నీళ్ల తీసుకువచ్చి అమ్మవారికి అభిషేకం చేశారు. కార్తీక పౌర్ణమికి ముందు వచ్చే శుక్రవారం అమ్మవారికి కుంభాభిషేకం చేయడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ పురోహితులు రాజ్‌కుమార్ తెలిపారు. ఇలా చేయడం వల్ల సంతానం, సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని భక్తుల విశ్వాసం.

ఉచిత దంత వైద్యశిబిరం



వైద్యసేవలు అందిస్తున్న డెంటిస్ట్

జామి: మండలంలోని భీమసింగి గ్రామంలో అనిల్‌నీరుకొండ ఆస్పత్రి సిబ్బంది శుక్రవారం ఉచిత దంతవైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు పి.స్వాతి, శ్రీనివాస్ సుమారు 150 మంది రోగులకు వైద్యపరీక్షలు చేసి మందులు ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జొన్నాడ వెంకటలక్ష్మి, ఉప సర్పంచ్ జొన్నాడ వాసు, ధనుంజయ, పీఆర్వో శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం రేపు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద ఈ నెల 26న సహాయ స్ఫూర్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ కార్యదర్శి ఎం.సాయి రేవంత్ తెలిపారు. మెంటాడ రోడ్డు జంక్షన్ వద్ద శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ఆపదలో ఉన్న మరోకరి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకువచ్చి రక్తదానం చేయాలని కోరారు.

డీఈఓ ఆకస్మిక తనిఖీ



విద్యార్థుల్లో విద్యాప్రమాణాలు తెలుసుకుంటున్న డీఈఓ లింగేశ్వరరెడ్డి

మెంటాడ(గజపతినగరం రూరల్): మండలంలోని పురిటిపెంట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను డీఈఓ లింగేశ్వరరెడ్డి శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేపట్టారు. విద్యార్థులకు తెలుగుభాషలో ఉన్న ప్రావీణ్యంతో పాటు పదాలను పలికే విధానాన్ని పరిశీలించారు. కొంతమంది విద్యార్థులు చదువులో వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు. వారికి పాఠశాల ముగిసిన తరువాత అరగంట పాటు అదనంగా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆయన వెంట ఎంఈఓ విమల, విద్యాశాఖ సిబ్బంది ఉన్నారు.

సీఎం జగన్‌తోనే.. సంక్షేమం, అభివృద్ధి



జామి: అన్నంరాజుపేటలో సంక్షేమ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ గొర్లె సరయు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.రవికుమార్

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డితోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని పలువురు ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు అన్నారు. చీపురుపల్లి, ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గంలోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో శుక్రవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా పార్టీ జెండా ఎగురవేసి 'జై జగన్' అంటూ నినాదాలు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. గ్రామ సచివాలయం వద్ద అధికారులతో కలిసి సంక్షేమ పథకాల డాష్‌బోర్డులను ఆవిష్కరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మద్దతుగా నిలవాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



గంట్యాడ: బోనంగిలో నిర్వహించన సభలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి



వేపాడ: ఆతవలో సంక్షేమ పథకాల డాష్‌బోర్డును ఆవిష్కరించిన ప్రజాప్రతినిధులు



దత్తిరాజేరు: మరడాంలో ఆంధ్రాకు జగనే ఎందుకు కావాలో ప్రజలకు వివరిస్తున్న ఎంపీపీ గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్పీటీసీ రౌతు రాజేశ్వరి



చీపురుపల్లి: హడ్కోకాలనీలో సంక్షేమ పథకాలు బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మెంటాడ: గజపతినగరం మండలం కొణిశ గ్రామంలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ బెల్లాన జ్ఞానదీపిక, తదితరులు



బొండపల్లి: బి.రాజేరులో వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చల్లా చలంనాయుడు, జెడ్పీటీసీ రాపాక సూర్యప్రకాశరావు, తదితరులు



కొత్తవలస: చింతలపాలెంలో గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ నీలంశెట్టి గోపెమ్మ



లక్కవపుకోట: భీమాళిలో సంక్షేమ బోర్డులను అధికారులతో కలిసి ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు



చీపురుపల్లి రూరల్: గరివిడి మండలం వెదుళ్లవలసలో పార్టీ జెండా ఎగురవేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



గుర్ల: కొండగండ్రేడులో సంక్షేమ పథకాల డాష్‌బోర్డు ఆవిష్కరిస్తున్న జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, నాయకులు సూర్యనారాయణరాజు, సన్యాసినాయుడు

చిరుధాన్యాల సాగుపై దృష్టిసారించాలి



రైతులకు ఈ-క్రాప్ రశీదులను అందజేస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి

గంట్యాడ: ఈ–క్రాప్ నమోదుకు సంబంధించి రైతు భరోసా కేంద్రం సిబ్బంది అందించిన ఎకనాలెడ్జ్‌మెంట్(రశీదు)లను రైతులు భద్రపరుచుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వి.తారకరామారావు సూచించారు. మండలంలోని రావివలస రైతుభరోసా కేంద్రాన్ని శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు చిరుధాన్యాల సాగుపై దృష్టిపెట్టాలన్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉన్నందున రబీలో చోడిపంట సాగుచేయాలని సూచించారు. ధాన్యం మాదిరిగానే చోడిపంటను కూడా ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి బి.శ్యామ్‌కుమార్, వీఏఏలు పాల్గొన్నారు.

నేడు బడ్జెట్ సమావేశం

లక్కవరపుకోట: మండల ప్రజా పరిషత్ సవరణ బడ్జెట్ సమావేశం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.రూపేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 సవరణ బడ్జెట్, 2024–25 అంచనా బడ్జెట్‌పై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మండలంలోని ఎంపీటీసీలు విధిగా హాజరుకావాలని కోరారు.

విద్యార్థుల్లో ఆసక్తి పెంచేలా బోధించాలి



వేపాడ: ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న ఎంఈఓ-2 బాలభాస్కరరావు



కొత్తవలస: ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తున్న మాస్టర్ ట్రైనీ

వేపాడ: విద్యార్థులకు గణితం, సైన్స్ పట్ల ఆసక్తి పెంపొందించేలా ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ బాలభాస్కరరావు అన్నారు. మండలంలో వేపాడ, సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించిన బోధనాభివృద్ధి కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. వేపాడ ఉన్నత పాఠశాలలో గణితంలో నూతన బోధన పద్ధతులపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. అలాగే సోంపురం ఉన్నత పాఠశాలలో సైన్స్ బోధన పద్ధతులపై రిసోర్స్ పర్సన్లు ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు ఎస్.ఎస్.వల్లి, బీపీఏ రాజు, తదితరులు పాల్గొన్నారు.

☛ శృంగవరపుకోట: స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాల, ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్.కోట, గంట్యాడ మండలాలకు చెందిన సైన్స్, గణిత ఉపాధ్యాయులకు నిర్వహించిన బోధనాభివృద్ధి శిక్షణ కార్యక్రమం శుక్రవారంతో ముగిసింది. గణితం, సైన్స్‌లో నూతన బోధనా పద్ధతులు, విద్యార్థుల సామర్థ్యాల మదింపు, తదితర అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో కోర్సు డైరెక్టర్ బి.ఉమామహేశ్వరరావు, స్టేట్ రిసోర్స్ పర్సన్ ఎస్.వి.ఎస్.ఎన్.మూర్తి, అరసాడ సురేంద్రనాథ్, ఎంఈఓ బి.నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

☛ కొత్తవలస: అభ్యసనాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తవలస, జామి మండలాల్లో 6,7,8 తరగతులకు గణితం బోధిస్తున్న ఉపాధ్యాయులకు శుక్రవారం శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. హెచ్‌ఎం చీపురపల్లి ఈశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 38 మంది ఉపాధ్యాయులు హాజరైయారు. వెనుకబడిన విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా గణితం ఎలా బోధించాలో హెచ్‌ఎం ఈశ్వరరావు వివరించారు.

అన్నదాత ఆందోళన



ఎం.వెంకటాపురం సమీపంలోని పొలాల్లో వేసిన వరికుప్పలు

గజపతినగరం: ప్రస్తుతం ఖరీఫ్ వరి పంటకోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ సమయంలో తుపాను ముప్పు పొంచిఉందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేయడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. శుక్రవారం ఉదయం నుంచి వాతావరణంలో మబ్బులు వేయడంతో కోసిన పంటను కుప్పలుగా పెట్టేందుకు రోజంతా శ్రమించారు. గజపతినగరం, వెంకటాపురం, దావాలపేట, మదుపాడ, శ్రీరంగరాజపురం, తదితర గ్రామాల్లోని పొలాల్లో చిన్నచిన్న వరికుప్పలు దర్శనమిస్తున్నాయి. మరో రెండు రోజుల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున రైతులు పంటకోతలు వాయిదా వేసుకోవాలని వ్యవసాయశాఖ సిబ్బంది సూచిస్తున్నారు.

వైద్యాధికారిగా రఘు

దత్తిరాజేరు: మండలంలోని కె.కొత్తవలస ప్రాథమిక ఆరోగ్య కేంద్రం రెండవ వైద్యాధికారిగా కె.రఘు శుక్రవారం బాధ్యతలు చేపట్టినట్లు హెల్త్ ఎడ్యుకేటర్ గిరిబాబు తెలిపారు. ఇక్కడ పనిచేసిన డాక్టర్ సంతోషిరూప ఉన్నత వైద్యవిద్య అభ్యసించేందుకు సెలవుపై వెళ్లడంతో ఆమె స్థానంలో రఘు బాధ్యతలు చేపట్టారు.

బ్యాంకు సేవలపై అవగాహన



ఎస్‌బీఐ సేవలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు, బ్యాంకు అధికారులు

చీపురుపల్లి రూరల్(గరివిడి): భారతీయ స్టేట్ బ్యాంకు(ఎస్‌బీఐ) ద్వారా అందిస్తున్న సేవలపై గరివిడి మండలంలోని గెడ్డపువలస, తోండ్రంగి, దేవాడ, శివరాం, దుమ్మెద, వీపీ రేగ, తదితర గ్రామాల్లో శుక్రవారం కళా బృందాలతో అవగాహనా కార్యక్రమాలు నిర్వహించారు. రాజమహేంద్రవరం కళాకారులు విబూతి బ్రదర్స్ మేజిక్ షో ద్వారా ఆర్థిక అక్షరాస్యత, పీఎం జీవనజ్యోతి, ప్రధానమంత్రి సురక్ష యోజన పథకం, డ్వాక్రా సంఘాల స్వయం సిద్ధ పథకం ద్వారా అదనపు రుణం, ఎస్‌బీఐ యోనోయాప్, జనరల్ ఇన్సూరెన్సు, రూపేకార్డు వినియోగం, ఆర్‌డీ అకౌంట్, పీఎం విశ్వకర్మ రుణాలు, అటల్ పెన్షన్ యోజన, సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు.

స్కూల్ బస్సులు ప్రారంభం

బొండపల్లి: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్ బ్యాంకు రిజనల్ మేనేజర్ పి.నరేష్ అన్నారు. మండలంలోని గొట్లాం గాయత్రీ టెక్నో స్కూల్ యాజమాన్యం బ్యాంకు రుణంతో కొనుగోలు చేసిన రెండు స్కూల్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు ద్వారా తక్కువ వడ్డీకే రుణాలు అందిస్తున్నామని, వ్యాపారులు, ఖాతాదారులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గొట్లాం యూనియన్ బ్యాంకు మేనేజరు పి.మల్లేశ్వరరావు, పాఠశాల కరస్పాండెంట్ జి.ఎరుకునాయుడు, జి.జగదీశ్వరి, ఏఓ జి.రాఘవ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స ఆరోగ్యంగా ఉండాలని పూజలు



పూజలు చేస్తున్న ఎంపీపీ ప్రమీల, జెడ్పీటీసీ అప్పలనాయుడు, కేవీ సూర్యనారాయణరాజు

గుర్ల: రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఎంపీపీ పొట్నూరు ప్రమీల, జెడ్పీటీసీ శీర అప్పలనాయుడు, పలాస నియోజకవర్గ పరిశీలకులు కేవీ సూర్యనారాయణరాజు, తదితరులు గుర్ల శివాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. ఇటీవల మంత్రి బొత్స సత్యనారాయణకు గుండె శస్త్రచికిత్స జరిగిన సంగతి తెలిసిందే. ఆయన త్వరగా కోలుకొని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండలాని శివాలయం వద్ద 101 కొబ్బరి కాయలు కొట్టి పూజలు చేపట్టారు. వైఎస్సార్‌సీపీ నాయకులు పొట్నూరు సన్యాసినాయుడు, బెల్లాన బంగారునాయుడు, జమ్ము స్వామినాయుడు, వరదా ఈశ్వరరావు, తోట తిరుపతిరావు, బోళ్ల సుబ్రహ్మణ్యం, కెంగువ మధుసూదనరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుకు సిద్ధం కావాలి



సిబ్బందికి శిక్షణ ఇస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

చీపురుపల్లి: ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు చేసేందుకు వ్యవసాయశాఖ సిబ్బంది సిద్ధం కావాలని ఏడీఏ ఎన్.కోటేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం ధాన్యం కొనుగోలుపై వీఏఏలు, డేటాఎంట్రీ ఆపరేటర్లు, టీఏలకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుభరోసా కేంద్రాలు ద్వారా ధాన్యం కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. వాహనాల వివరాల నమోదు, గోనె సంచుల సరఫరా, ఎఫ్‌టీఓ నమోదు, కూలీల పేమెంట్స్ తదితర అంశాలపై సిబ్బందికి అవగాహన కల్పించారు. పారదర్శకంగా, సమర్థవంతంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి సీహెచ్.రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.

స్త్రీ, శిశు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి

గంట్యాడ: స్త్రీ,శిశు సంక్షేమానికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీపీ పీరుబండి హైమావతి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో 'నాడు–నేడు' అంగన్‌వాడీ భవనాల ఆధునీకరణపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, పాఠశాల హెచ్‌ఎంలకు శుక్రవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నాడు–నేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్ స్కూళ్లు, ఆస్పత్రులకు దీటుగా తీర్చిదిద్దారన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను కూడా ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలన్నారు. చిన్నారులకు అవసరమైన అన్ని వసతులు కల్పించాలని, పనుల నాణ్యతలో రాజీపడొద్దని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వర్రి నరసింహమూర్తి, జిల్లా విద్యాశాఖాధికారి లింగేశ్వర రెడ్డి, జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ సాధికారిత అధికారి బి.శాంతకుమారి, సీడీపీఓ దోకుల ఉమాభారతి, ఎంఈఓలు విజయకుమారి, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత శుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న హెల్త్ కౌన్సిలర్ భానుప్రియ

చీపురుపల్లి: మహిళలు జాగ్రత్తలు పాటించడం ద్వారానే సంపూర్ణ ఆరోగ్యంగా ఉండగలరని అడల్‌సెన్స్ హెల్త్ కౌన్సిలర్ ఎస్.భానుప్రియ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాలలో శుక్రవారం రాష్ట్రీయ కిశోర్ స్వచ్ఛతా కార్యక్రమంలో భాగంగా 'మహిళా ఆరోగ్యం–పరిశుభ్రత' అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుప్రియ మాట్లాడుతూ.. సమ తుల్య పోషకాహారాన్ని తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యం బాగుంటుందని అన్నారు. రుతుక్రమం సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా కౌమారదశలో ఉన్న బాలికలు వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఎం.రమేష్‌కుమార్, మహిళా సాధికారత విభాగం కోఆర్డినేటర్ వై.విజయభారతి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ జ్వాలాముఖి తదితరులు పాల్గొన్నారు.